

అతను అప్పుడే కాబోలు లేచి వాకిట్లోకి వచ్చాడు. ఏదో గొడవ లాగుందని, తీరా మమ్మల్ని చూసి అందర్నీ పలుకరించాడు. మా దంతధావన తీర్మానం విని లోపలికి వెళ్లి వేప పుల్లల కట్ట తీసుకొచ్చి మా ముందు పెట్టి "కానీయండి" అన్నాడు.

"ఛస్! ససేమిరా వీల్లేద"న్నాము. "అయితే, పోండి" అని ఒక్క ముక్క చెప్పి, ఇంట్లోకి వెళ్లి" పళ్లు తోముకోకుండా వుంటే టీ నీళ్లు కూడా ఇయ్యొద్దని అత్తయ్యకు ఆర్డరు జారీ చేశాడు. మేం మొండికేసి కూర్చున్నాం. సుమారు ఎనిమిదిన్నర గంటలు దాటిపోయింది. ఆమరణ నిరాహార దీక్ష చెయ్యడానికైనా సిద్ధమేగానీ, వేపపుల్లలతో పళ్లు తోముకోమని భీష్మించుకు కూర్చున్నాం. మా మావయ్యకు తెలీకుండా ఒక పేస్టు, బ్రష్‌లు తెప్పించి "మీ మామయ్యకు కనబడకుండా పెరట్లోకి వచ్చి బ్రష్ చేసుకోమంది మా అత్తయ్య. అలాగే అని చెప్పి ఆ తరువాత అందరం బ్రష్‌లు పట్టుకుని మా మామయ్యముందు నిలబడి బ్రష్ చేస్తున్నాము, అతన్ని వెక్కిరిస్తున్నట్టు. అతను ఏమీ అనలేదు. మాకు మనసుండబట్టడంలేదు. అతన్ని ఎలాగైనా ఉడికించాలనిపించింది. అంతలో మా వాసుగాడు "మామా! కావాలా పేస్టు" అని దుర్యోధనుడిలాగ ఫోజు కొట్టాడు. ఇంతలో మా సురేష్ "వద్దులే అతనికిది వేస్ట్" అన్నాడు. "అయినా అది చాలా కాస్ట్" అని మరొకడు, "పళ్లకు చాలా బెస్ట్" అని నేనూ, ఇలా ఒక్కొక్కరం ఒక ప్రాస చొప్పున ఏదో ఒకటి వాగుతున్నాం. అతను నిదానంగా వేపపుల్ల నములుతున్నాడు. మా ప్రాసలకి అంతం లేకుండా పోయింది. అతను మా అందరి వైపు తిరిగి "ఎందుకురా అలా బీస్ట్లలాగ అరుస్తారు" అని తక్కున అన్నాడు. అంతే, తలా ఒక దిక్కుకి చెదరిపోయాం. మరి ఆ రోజు అతని కంటపడలేక పోయాం.

—యెలిశెట్టి పాపారావు

# సంస్కారం



ఒకసారి బొంబాయిలో తెలిసినవారింటికి వెళ్ళాము. ఆ రోజు వారింట్లో తద్దినం.

బ్రాహ్మలు వచ్చి మంత్రం చదివి భోజనాలు చేశారు. పితృ దేవతల కోసం పెట్టిన పిండాలు కలపడానికి చేరువలో నదులుగాని, పెట్టడానికి ఆవులు గాని, వేయడానికి నిప్పులుగాని, గోతులు తీయడానికి మట్టి జాగాగాని లేకపోవడంవల్ల స్కూటర్‌పై వెళ్తున్న ఆ బ్రాహ్మలకే ఇచ్చేశారు ఎక్కడో కొన్ని మైళ్ళ దూరాన గల చెరువులో కలపమని.

ఇక మిగిలిన అందరి భోజనాలు అయ్యాయి. అందరూ సుష్టుగా సాయంకాలం నాలుగు గంటలకి భోజనాలు చేశారు. ఇక రాత్రికి ఎవరికీ ఆకళ్ళు లేవన్నారు.

పదార్థాలు, పిండి వంటలు మిగిలిపోయాయి. అవి పితృ శేషం కాబట్టి మర్నాడు తినకూడదుట. హీన జాతిది కాబట్టి పనిమనిషికి ఇవ్వకూడదుట. బయట పడేస్తే అశుద్ధం తినే కుక్కలు, హీన జాతి వాళ్ళు తింటే పితృదేవతలకి అపచారం చేసినట్టుట. ఇరుగుపొరుగులకి ఇవ్వకూడదుట. అందుకని మిగిలిన పదార్థాలు, పిండి వంటలు, బ్రాహ్మలు భోంచేసిన విస్తళ్ళు (చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి) అన్నీ తీసుకెళ్ళి కక్కస్‌లో పోసిందా ఇల్లాలు.

అశుద్ధం తినే కుక్కలు, తక్కువ కులాల వారు ముట్టుకుంటేనే పితృ దేవతలకి అపచారం చేసినట్టు భావించే వీరు- అశుద్ధానికి నిలయమైన కక్కస్-పవిత్రమైనదని భావిస్తున్నారు. ఇలాంటి నమ్మకాన్ని ఏమనాలంటారు!

— ఆర్.ఎస్. హైమవతి

# దైవోపాయం

'పోస్ట్' పోస్ట్‌మేన్ కేక వినిపించింది. పిల్లల యూనిట్ పేపర్లు దిద్దుతున్న రాజారావు ఉత్తరం అందుకోడానికి లేవబోయాడు. ఈలోగానే అతని భార్య వంట గదిలోంచి పైట కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వడివడిగా వచ్చి కవరు అందుకుంది. అతని దగ్గరకు తెచ్చేలోగానే సాంతం చదివేసి అతని చేతికిచ్చింది. అది ఓ కరపత్రం! ఆశ్చర్యపోతూనే చదివాడు రాజారావు.

"సంతోషిమాత భక్తుల కోర్కెలు తీర్చే దేవత. ఆమె నామాన్ని ప్రతిరోజూ అరగంట జపించిన వారికి కోరిన కోరికలు సిద్ధించును. అట్లు చేసిన ఒక నిరుపేద ధనవంతుడయ్యెను. సంతానము లేని ఒక ఇల్లాలు సంతానవతి అయ్యెను. ఒక నిరుద్యోగికి ఉద్యోగము లభించెను. కావున, ఆ తల్లిని పూజించి మీ కోర్కెలు తీర్చుకొనండి. ఇది చదివినవారు ఇదే విధముగా నీకై కరపత్రములు ప్రింటు వేయించి మీ స్నేహితులకు పంచండి. అట్లు చేయనియెడల మీరు కష్టనష్టాలకు గురియగుదురు... ఇట్లు ఒక భక్తురాలు."

రాజారావుకు ఆ కరపత్రాన్ని ముక్కలు ముక్కలు చేసి నమిలి మింగేద్దామన్నంత కోపం వచ్చింది. కాని, అతని భార్య ఓ సెంటిమెంటల్ ఫూల్. నిజంగా ఏదైనా చెడు జరిగితే 'ఆ రోజు ఆ కాగితాన్ని చింపారు. అందుకే ఇలా జరిగింది' అంటూ తనని తినేస్తుంది. అందుకే ఆలోచిస్తూ వుండిపోయాడు.

అతను నాస్తికుడు కాదు కాని దేవుణ్ణే అడ్డుగా పెట్టుకొని మనిషి చేస్తున్న వ్యాపారాన్ని అతని మనసు తీవ్రంగా గర్హిస్తోంది. అతనలా ఆలోచనలో వుండగానే అతని భార్య వాళ్ళ పెద్దబ్బాయిని పిలిచి ఆ కరపత్రంలోని మేటర్‌ను ప్రింటింగ్ ప్రెస్‌కు పంపే ఏర్పాటు చేసింది. కవర్లు తెమ్మని చిన్నబ్బాయిని పోస్టాఫీసుకు తోలేసింది. రాజారావు అవాక్కయి కూర్చుండిపోయాడు.

కరపత్రాలు! కరపత్రాలు!! సంతోషిమాతను కీర్తిస్తూ కరపత్రాలు! వచ్చిన ప్రతివారికి నీకై కరపత్రాలు ప్రింట్ చేసి అందించలేక ఆ ఊళ్ళో ప్రెస్ యజమాని తలమునకలవుతున్నాడు.

సంతోషిమాత పుణ్యమాని అతనికి చేతినిండా పని, జేబునిండా డబ్బు! అతనికి మహదానందంగా వుంది. ఎందుకంటే పెళ్ళిళ్ళ సీజను అయిపోయి ఖాళీగా వున్న తనకు ఒక రోజున మెరుపులా తట్టిన ఒక ఆలోచనకు ఇది ఊహించని రెస్పాన్స్ కనుక.

— గుబ్బల సత్యనారాయణమూర్తి